

గర్భిణికి తప్పని వెతలు

ప్రజాశక్తి-పెదబయలురూరల్: కిముడుపల్లి పంచాయతీ సావిడిమామిడి గ్రామానికి చెందిన గర్భవతి కొర్ర జయంతికి శనివారం ఉదయం పురిటి నొప్పులు రావడంతో 108 వాహనాన్ని సంప్రదించారు. మెటల్ రోడ్డు కావడంతో మార్గమధ్యంలో వాహనం ఆగి పోవడంతో గత్యంతరం లేక గర్భవతిని సుమారు మూడు కిలోమీటర్లు దూరం కుటుంబ సభ్యులు డోలి మోతతో సావిడిమామిడి గ్రామ నుండి కిముడుపల్లి జంక్షన్ వద్ద తీసుకొని వెళ్లారు. అక్కడి నుంచి 108 వాహనంలో పాడేరు ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అధికారులు గుత్తేదారులపై ఒత్తిడి తెచ్చి రహదారి సౌకర్యం కల్పించాలని కుటుంబ సభ్యులు కోరారు.



ఆసుపత్రికి మోసుకెళుతున్న కుటుంబీకులు

అడుగడుగునా అడ్డగింతలు





- గిరిజన ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, ఫాల్గుణలపై గిరిజనుల ఆగ్రహం
- బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చడంపై నిలదీతలు
- అసెంబ్లీలో ఎందుకు ప్రశ్నించలేదు : గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లాలోని పాడేరు ఏజెన్సీలో పాడేరు, అరకు నియోజకవర్గాల ఎమ్మెల్యేలిద్దరికీ నిరసన సెగలతో ఉక్కపోత మొదలైంది. ఓట్ల కోసం గిరిజనులకు ద్రోహాన్ని తలపెట్టిన వైసిపి ప్రభుత్వ కుట్రలను తిప్పుకొట్టాలని, గిరిజనుల ఉనికికే ప్రమాదకరమైన వైసిపి ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకించని ఎమ్మెల్యేలకు బుద్ధి చెప్పాలని గిరిజనులు సిద్ధమవుతున్నారు. గిరిజన ప్రజా సంఘాల ఆందోళన, నిరసన కార్యక్రమాల్లో భాగంగా నియోజకవర్గాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యేలను నిలదీస్తున్నారు. బోయ/వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలన్న అసెంబ్లీ తీర్మానానికి అనుకూలంగా వ్యవహరించిన ఎమ్మెల్యేలపై గిరిజనులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో ఎక్కడికి వెళ్లినా గిరిజనుల నుంచి నిరసనలు తప్పడం లేదు. గడపగడపకు తదితర ప్రభుత్వ కార్యక్రమాలకు వెళుతున్న ఎమ్మెల్యేలను స్థానిక గిరిజనులు అడ్డుకుని నిరసన వ్యక్తం చేస్తున్నారు. బోయ వాల్మీకి, బెంతు ఒరియా సహా అనుబంధ కులాలను ఎస్ టి జాబితాలో చేర్చాలని వైసిపి ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేస్తే ఎందుకు స్పందించలేదని ఎమ్మెల్యేలను ఎక్కడికక్కడ నిలదీస్తున్నారు. పదవులకు రాజీనామా చేసి గిరిజనుల పక్షాన నిలవాలని డిమాండ్ చేస్తున్నారు. గిరిజనుల మనుగడకే ప్రమాదకరమైన ప్రభుత్వ నిర్ణయాలు, అసెంబ్లీ తీర్మానంపై ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందిన ఇతర కులాలను ఎస్‌టి జాబితాలో చేర్చుతూ ముఖ్యమంత్రి జగన్ అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెడితే గిరిజన ఎమ్మెల్యేలుగా అడ్డుకోవాల్సింది పోయి ఎందుకు మౌనం వహించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పదవుల కోసం గిరిజనుల మనుగడ సమస్యలపై మాట్లాడకపోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గిరిజనులంతా ఉద్యమాలు, బంద్ లతో ఆందోళనలు, నిరసనలు చేస్తుంటే, గిరిజనుల గోస వైసిపి ప్రభుత్వానికి, గిరిజన ఎమ్మెల్యేలకు వినబడడం లేదా? అని ప్రశ్నిస్తున్నారు. అధికారం కోసం వైసిపి ప్రభుత్వానికి తొత్తులుగా వ్యవహరిస్తూ ఓట్లేసి గెలిపించిన గిరిజన జాతికి ద్రోహం చేస్తున్నారని ఎమ్మెల్యేలపై మండిపడుతున్నారు. ఓట్లేసి గెలిపించిన గిరిజనుల పక్షాన నిలుస్తారో, జగనన్న సంతోషం కోసం బోయ వాల్మీకుల పక్షాన నిలిచి గిరిజన ద్రోహులుగా మిగిలిపోతారో ఎమ్మెల్యేలు తేల్చుకోవాలని హెచ్చరిస్తున్నారు. తక్షణమే పదవులకు రాజీనామా చేయాలని లేని పక్షంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

ఇటీవల అడ్డగింతలు

జిల్లావ్యాప్తంగా ఆదివాసీలు చేపట్టిన ఆందోళనలు రోజురోజుకీ తీవ్ర రూపం దాల్చు తున్నాయి. పాడేరు, అరకులోయ ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణతో పాటు జడ్‌పి చైర్మన్ జల్లిపల్లి సుభద్రల పర్యటనలను ఆయా నియోజకవర్గాల్లో గిరిజనులు అడ్డుకుంటున్నారు. అసెంబ్లీలో ఆమోదించిన తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని జడ్‌పిటిసిలు, ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు సైతం తోటి గిరిజనుల నుంచి వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. మా భవిష్యత్ నీవే జగన్ అంటూ ఇంటింటికి స్టిక్కర్లు అంటించేందుకు వస్తున్న ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులపై తిరగబడాలని ఆదివాసి జెఎసి పిలుపునిస్తూ పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి నివాసం ఉంటున్న తలారిసింగిలో ప్రచారం చేపట్టారు.

చింతపల్లి మండలం వామగెడ్డ గ్రామ సచివాలయ భవనం ప్రారంభానికి వెళ్లిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మిని గిరిజన సంఘం నాయకులు అడ్డుకున్నారు. హుకుంపేట, ముంచంగిపుట్టు మండలాల్లో పర్యటించిన అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణను గిరిజన సంఘం నాయకులు అడ్డుకున్నారు. అనంతగిరి మండలంలో ఆసరా పథకం లబ్ధిదారులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే పాల్గుణ హాజరు కావాల్సి ఉన్నప్పటికీ.. హుకుంపేటలో జరిగిన చేదు అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని సమావేశాన్ని రద్దు చేశారు. పాడేరు ఎంపిపి రత్నకుమారి భర్త రమణమూర్తి, వైసిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు మత్స్యరాస వెంకటలక్ష్మి తదితరులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసేందుకు రాగా ఆదివాసి జెఎసి నాయకులు అడ్డుకున్నారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి రాక కోసం ఏర్పాట్లు చేసేందుకు ప్రయత్నించగా అడ్డుకున్నారు. కూడలి వద్దకు రావద్దని పోలీసులు ఎమ్మెల్యేకు సూచించడంతో క్యాంపు కార్యాలయం వద్దే అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి నిరసన సెగ

పాడేరు: మండలంలోని మోదాపల్లి పంచాయతీ కాంగెడ్డ, కారెబంద గ్రామాల్లో శనివారం వైసిపీ గడప గడప కార్యక్రమానికి హాజరైన పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మికి నిరసన సెగ తగిలింది. బోయ వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చుతూ ముఖ్యమంత్రి తీర్మానం ప్రవేశపెడితే ఎందుకు మౌనం వహించారని గిరిజన సంఘం నాయకులు ప్రశ్నించారు . గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు పాలికి లక్కు, నాయకులు ఎల్.సుందరరావు , ఎస్ఎఫ్ఐ నాయకులు చిన్నారావు, సూరిబాబు, గ్రామస్థులు రహదారిపై బైఠాయించారు. ఏపీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు పాలికి లక్కు, మాట్లాడుతూ, బోయవాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేరిస్తే ఆదివాసీలు అన్యాయమైపోతారన్నారు.పార్టీ మేనిఫెస్టోలో బోయవాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చుతామని హామీ ఇచ్చినందున, ఆ మేరకు తీర్మానం చేసి కేంద్రానికి పంపించాలని ముఖ్యమంత్రి సమాధానం ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. ఏజెన్సీలో వ్యతిరేకతపై మళ్లీ తమ వంతుగా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతామని ఆమె చెప్పారు. అయినా మిమ్మల్ని నమ్మబోమని గిరిజన సంఘం నాయకులు ఎమ్మెల్యే కారుకి అడ్డంగా నిలబడ్డారు. పోలీసులు జోక్యం చేసుకొని నాయకులను అడ్డగించి ఎమ్మెల్యేను అక్కడ నుంచి పంపించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు రాజు, భాస్కరరావు, బాలరాజు, లోకేష్, మత్స్యరాజు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను అడ్డుకుంటున్న గిరిజన సంఘం నేతలు



తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న చిన్నారి ఫాతిమా

బైక్‌ను ఢీకొన్న కారు

భార్యాభర్తలు, చిన్నారికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి చింతూరు

చింతూరు మండలంలోని కాటుక పల్లి గ్రామం వద్ద జాతీయ రహదారి-30పై శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య, భర్త, వారి పాపకు తీవ్ర గాయాలయ్యాయి. కారు వేగంగా వచ్చి మోటార్ సైకిల్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. చత్తీస్‌ఘడ్ రాష్ట్రం సుకుమార్ జిల్లా కుంట గ్రామానికి చెందిన కెహెచ్.బహదూర్ ఖాన్ (36), ఆయన భార్య సాను (30) కుమార్తె ఫాతిమా (5) శనివారం ఉదయం ద్విచక్ర వాహనంపై భద్రాచలంలో ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లారు. తిరిగి మధ్యాహ్నం కుంటకు వెళుతుండగా కాటుకుపల్లి సమీపంలో వెనుక నుంచి వచ్చిన కారు వారి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ అదుపుతప్పి చెట్టును బలంగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న భార్య, భర్త, వారి పాపకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని ఏడుగురాళ్లపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి 108 అంబులెన్స్‌లో తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. కారు కారు డ్రైవరు పరారీలో ఉన్నారు.



చికిత్స పొందుతున్న సాను



సెల్ టవర్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

మన్యంలో వడగళ్ల వాన

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: మండలంలో శనివారం సాయంత్రం పిడుగు శబ్దాలతో కూడిన భారీ వడగళ్ల వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండ ఎక్కువగా కాసింది. ఆ తర్వాత వడగళ్లతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఎండల తీవ్రతకు ఉక్క పోతకు గురైన గిరిజనులకు ఈ వర్షం కొంత ఉపశమనం ఇచ్చింది.

పెదబయలు: మండల కేంద్రంలో శనివారం సాయంత్రం సుమారు 5గంటల సమయంలో వడగళ్ల వర్షం కురిసింది. మధ్యాహ్నం విపరీతమైన ఎండ కాసింది. సాయంత్రానికి ఒకేసారి వాతావరణంలో. మార్పులు చోటు చేసుకొని కుండ పోతగా వడగళ్ల వాన కురవడంతో వాతావరణం చల్లబడింది.



కురుస్తున్న వర్షం

కార్మికులకు బకాయిలు చెల్లించాలి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బాలదేవ్

ప్రజాశక్తి-అరకులోయరూరల్: మండలంలోని పద్మపురం, కొత్తవలస, చింతపల్లి నర్సరీలో పని చేస్తున్న హెచ్ఎన్‌టిసి కార్మికులకు మూడు నెలల బకాయి జీతాలు చెల్లించి, ఇతర సమస్యలు పరిష్కారం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.బాలదేవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో పద్మాపురం, కొత్తవలస, చింతపల్లి నర్సరీ కేంద్రాల్లో 73 మంది హెచ్ఎన్‌టిసి కార్మికులు పని చేస్తున్నారని, 56 మందికి అనేక సాకులు చెప్పి జీతాలు చెల్లించలేదన్నారు.తక్షణమే మూడు నెలల బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో నియమించిన 16 మందికి కలెక్టర్ గెజిట్ జీవో అమలు చేయాలని ఆదేశాలు ఉన్నప్పటికీ అమలు చేయడం లేదన్నారు. 2022- 23 కలెక్టర్ గెజిట్ జీవో ప్రకారం జీతాలు చెల్లించి కొత్తగా చేరిన కార్మికులకు పీఎఫ్, అమలు చేయాలని తెలిపారు. కార్మికులను వారాంతపు సెలవు ఇవ్వాలని డిమాండ్ చేశారు.





ఇళ్లకు వెళుతూ ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా ముగిసిన టెన్త్ పరీక్షలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఈ నెల 3 నుంచి జిల్లా వ్యాప్తంగా విద్యాశాఖ నిర్వహించిన పదో తరగతి పరీక్షలు శనివారం ముగిసాయి. చివరి పరీక్ష రాసి వసతిగృహాలకు వచ్చిన విద్యార్థులు కేరింతలు కొడుతూ సందడి చేశారు. విద్యార్థులు ఒకరికొకరు ఆనందాన్ని పంచుకున్నారు. మళ్లీ కలుద్దామంటూ బై బై చెప్పుకున్నారు. సంతోషంతో ఇళ్ల బాట పట్టారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు పట్టణంలోని ఆయా పాఠశాలల్లోని వసతి గృహాల్లో ఉంటున్న పదో తరగతి విద్యార్థులు వస్తు సామగ్రి సర్దుకుని కుటుంబ సభ్యులతో తమ స్వగ్రామాలకు తరలి వెళ్లారు. తమ బిడ్డలను ఇళ్లకు తీసుకు వెళ్ళేందుకు పాఠశాలలకు బైకులు, ఆటోలతో వచ్చిన తల్లిదండ్రులు.. పిల్లల పెట్టెలను లగేజీలను మోస్తున్న కుటుంబ సభ్యులు.. కుమార్తెలను ఇళ్లకు తీసుకు వెళుతున్న తల్లులతో ఆయా పాఠశాలల్లో సందడి వాతావరణం నెలకొంది.

డుంబ్రిగూడ: ఈనెల మూడు నుంచి మండలంలో జరిగిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు శనివారంతో ప్రశాంతంగా ముగిసాయి. మండలంలోని 10 పాఠశాలల నుంచి చదువుతున్న విద్యార్థులకు మండల కేంద్రంలో మూడు పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసి విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కల్పించకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. పరీక్ష నిర్వహించే సమయంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా అధికారులు పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రశాంతంగా పరీక్షలు ముగియడంతో అటువంటి అధికారులు, పోలీసులు ఆనందం వ్యక్తం చేశారు.

హుకుంపేట: మండలంలోని పదో తరగతి పరీక్షలకు మూడు సెంట్లు ఏర్పాటు చేయగా 78 మంది విద్యార్థులు హాజరయ్యారు.15 పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఇంటి బాట పట్టారు. విద్యార్థులందరూ తమ తల్లిదండ్రులతో ఇంటి బాట పట్టారు.

'ఉపాధి హామీ'ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

★ ఏడాదికి 200 పని దినాలు, రోజు కూలి రూ.600 కల్పించాలి

★ ప్రచార భేరిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి-ఎటపాక

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి ప్రతి ఏటా నిధులు కేటాయింపులు తగ్గించడం ద్వారా దానిని నిర్వీర్యం చేసి పేదల ఉపాధిని దెబ్బ తీస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం అన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం, సిపిఐ చేపట్టిన ప్రచార భేరిలో భాగంగా మండలంలోని కెవిఎస్.పురం, గోళ్ళగట్ట గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో సీతారాం పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పని ప్రదేశాలకు వెళ్ళి కూలీలతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబానికి ఏడాదికి 200 పని దినాలు కల్పించాలని, రోజు కూలి రూ.600 ఇవ్వాలని, సమ్మర్ అలవెన్సులు పెంచాలని, వేతనాలు పెండింగ్ లేకుండా చూడాలని, పని ప్రదేశాల్లో టెంట్‌లు, మెడికల్ కిట్‌లు, మంచి నీరు, మజ్జిగ వంటి సౌకర్యాలు కల్పించాలని, పార, తట్ట, గునపం వంటి వస్తువులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను ధారాదత్తం చేస్తుందన్నారు. కులాలు, మతాల పేర్లతో పేదలను చీలుస్తున్న ప్రభుత్వాల కుట్రలను అర్థం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఐవి, నాయకులు ఆకిశెట్టి రాము, ఐ.పద్మ, జి.హరి, సీసం అర్జున్, పూనెం కన్నయ్య, పెనుబల్లి రాముడు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న మంతెన సీతారాం

రెండో రోజు ప్రచార భేరి

విఆర్.పురం : మోడీని గద్దె దించుదాం.. దేశానికి కాపాడుదాం నినాదంలో చేపట్టిన ప్రచార భేరి కార్యక్రమంలో భాగంగా సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు ఆధ్వర్యాన రెండో రోజు చిన్నమట్టపల్లిలో కారం శివమయ్య స్థూపానికి పూలమాలవేసి పాదయాత్రను ప్రారంభించారు. ఈ పాదయాత్ర చిన్న మట్టపల్లి నుండి సున్నవారిగూడెం మీదుగా కన్నాయిగూడెం వరకు సాగింది. ప్రతి ఇంటికి కరపత్రం పంచుతూ వారి సమస్యలు తెలుసుకుంటూ ప్రచార భేరి ముందుకు సాగింది. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వ హయాంలో అధిక ధరలు, నిరుద్యోగం, ప్రైవేటీకరణ, జిఎస్‌టి భారాలు ఎలా అన్నింటిలోనూ ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ద్రోహం చేస్తున్నా వైసిపి ప్రభుత్వం కనీసం మాట్లాడటం లేదన్నారు. పోలవరం ప్రాజెక్టుకు త్యాగం చేసిన నిర్వాసితులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు వడ్లాది రమేష్, అచ్యుత రావు, కారం కృష్ణమూర్తి, దేవయ్య, నరసింహమూర్తి, చందర్రావు పాల్గొన్నారు.

వారపు సంతలో ర్యాలీ

ముంచింగిపుట్టు : మండల కేంద్రంలో సిపిఎం, సిపిఐ ప్రచార బేరిని శనివారం నిర్వహించారు. వారపు సంతలో చేపట్టిన ర్యాలీలో నాయకులు మాట్లాడుతూ, ప్రజా వ్యతిరేక, నిరంకుశ బిజెపిని సాగనంపాలన్నారు. ప్రత్యేక హెూదా, పోలవరం, రాజధాని నిర్మాణం, రైల్వే జోన్, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజి వంటి హామిలను బిజెపి ప్రభుత్వం అమలు చేయలేదన్నారు.స్టీల్ ప్లాంట్ ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కుట్ర పన్నుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, లక్ష్మీపురం సర్పంచ్ త్రినాధ్, ఎంఎం శ్రీను, భీమరాజు, నరసయ్య, డోంబ్రు, నారాయణ, జీనబంధు, వరహాలు, శ్రీను పాల్గొన్నారు.



చిన్న మట్టపల్లిలో ర్యాలీ చేస్తున్న సిపిఎం నాయకులు



ముంచంగిపుట్టు వారపు సంతలో...

బూదరాళ్లలో డిఎఫ్ఒ పర్యటన

ప్రజాశక్తి-కొయ్యూరు : చింతపల్లి డిఎఫ్ఓ సూర్యనారాయణ పడాల్ శనివారం బూదరాళ్ల పంచాయతీలో పర్యటించారు. కునుకూరు నుంచి నల్లబిల్లి వరకు బీటీ రోడ్డు మంజూరైన నేపథ్యంలో దానిని పరిశీలించి అనుమతులు ఇచ్చేందుకు వచ్చినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గిరిజనులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏడాది చివరికి అన్ని గ్రామాలకూ సెల్ సేవలు

ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి - రంపచోడవరం

ఈ సంవత్సరం చివరి నాటికి అన్ని గ్రామాలకు సెల్ సేవలు అందుబాటులో ఉండేవిధంగా సెల్ టవర్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే తెలిపారు. శనివారం రంపచోడవరం మండలం చిలకమాడి గ్రామంలో బిఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటుకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంపచోడవరం ఏజెన్సీలోని అన్ని గ్రామాల ప్రజలకు టెలిఫోన్ సౌకర్యం ఏర్పాటు చేయుటకు 375 సెల్ టవర్లు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించినట్లు చెప్పారు. 375 సెల్ టవర్లు ఏర్పాటుకు ప్రభుత్వానికి సంబంధించిన స్థలాలు కూడా కేటాయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ పలివెల రాజు, డిప్యూటీ జనరల్ మేనేజర్ రాజశేఖర్ బాబు, ఏజీఎం సత్య రఘురాం, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జెన్‌కో ఉద్యోగ సాధన కమిటీ బైక్ ర్యాలీ

ప్రజాశక్తి -సీలేరు

ఏపీ జెన్కో ఉద్యోగ సాధన కమిటీ ఆధ్వర్యంలో శనివారం బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ కొంగపాకల గ్రామంలో గిరిజన యువతతో జరిగిన సమావేశంలో సాధన కమిటీ నాయకులు గౌడ్ సతీష్ మాట్లాడుతూ ఉద్యమంలో యువత ఒక అడుగు ముందుకు వేస్తే సాధించలేనిది ఏమీ ఉండదని తెలిపారు. సీలేరులో నూతనంగా పంపు స్టోరేజ్ ప్రాజెక్టులో ఉద్యోగాలు, ఉపాధి గిరిజన యువతకు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని వెల్లడించారు. ప్రాజెక్టు వల్ల నిర్వాసితులైన గిరిజనులకు భూమికి భూమి, ఇల్లుకు ఇల్లు, ఇంటికొక ఉద్యోగం కల్పించవలసిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. సిఎస్ఆర్ నిధులు కేటాయించి గిరిజన గ్రామాలను అభివృద్ధి చేయాలని, దారకొండ కేంద్రంగా 50 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు పరిధిలో ఉన్న గిరిజన గ్రామాలకు సీలేరు జల విద్యుత్ కేంద్రం నుంచి విద్యుత్ నేరుగా సరఫరా చేయాలని కోరారు. ఆదివాసీలంతా ఏకమై తమ హక్కుల గురించి ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు గొర్ల గణేశ్వరరావు, సలహాదారుడు కూడా ఆనంద్, స్థానికులు కిముడు మోహన్ బాబు, కొర్ర రాంబాబు, చిట్టి చిన్నబ్బాయి, తగ్గి భీమశంకర్రావు, భక్తుల మార్కు, కిలో మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న జెన్‌కో ఉద్యోగ సాధన కమిటీ నాయకులు

ఐదో తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - పెదబయలు :స్థానిక బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో 5వ తరగతి ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశాల నిమిత్తం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ డి.శంకర్రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈనెల 30 తేదీ నాటికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి-జి.మాడుగుల:మండలంలో ప్రతి మంగళవారం మండల స్థాయి అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని స్థానిక ఎంపీడీవో చంద్రశేఖర రావు శనివారం ప్రకటనలో తెలిపారు. మంగళవారం వారపు సంత కావడంతో ప్రజలు వివిధ సమస్యలతో ప్రభుత్వ కార్యాలయాలకు వస్తారని తెలిపారు. అందుబాటులో ఉండి వారి వినతులు స్వీకరించాలని అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు గైర్హాజరవుతున్నట్లు ఎమ్మెల్యే దృష్టికి వెళ్లిందన్నారు. తప్పనిసరిగా మండల స్థాయి అధికారులు ఈ కార్యక్రమానికి రావాలని ఎంపీడీవో తెలిపారు. హాజరుకాని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సచివాలయ సిబ్బందిపై డిఎల్‌డిఓ ఆగ్రహం

ప్రజాశక్తి -కోటవురట్ల: బయోమెట్రిక్ వేసి జీతాలు తీసుకుంటున్నారా? అని సచివాలయ సిబ్బంది పనితీరుపై అనకాపల్లి డిఎల్‌డిఓ మంజులా వాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆమె మండల సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. సస్టెయినబుల్ డెవలప్మెంట్ గోల్స్ పై నిర్వహిస్తున్న సర్వే వివరాలు పూర్తిస్థాయిలో సిబ్బంది నిర్వహించకపోవడం పట్ల ఆమె తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మూడు నెలల నుంచి నిర్వహిస్తున్న సర్వే నేటికీ పూర్తి స్థాయిలో చేయకపోవడంపై సర్వేపై మీకు అవగాహన ఉందా లేదా ఉంటే కార్యదర్శులను ప్రశ్నించారు. ఏ ఒక్కరు సరైన సమాధానం చెప్పక పోవడంతో మీరు కార్యాలయానికి వచ్చి బయోమెట్రిక్ వేసి జీతాలు తీసుకోవడమేనా ప్రతి విషయంలోనూ కోటవురట్ల మండలం వెనుకబడి ఉందని అధికారులు ఎవరు చిత్తశుద్ధితో పని చేయలేదన్నారు. అనంతరం ఆమె పలు శాఖల పనితీరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. జగనన్న ఇల్లు పనులు ముందుకు సాగక పోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్వేపట్నం డిఎల్‌డిఓ అరుణ శ్రీ, ఎంపీడీవో చంద్రశేఖర్, పి ఆర్ జె ఈ వర్మ, హౌసింగ్ ఇంజనీర్ జగదీశ్వరరావు, అగ్రికల్చర్ ఇంజనీర్ కరుణ, పలు శాఖల అధికారులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

34 మందికి ఉపకార వేతనాలు మంజూరు

ప్రజాశక్తి - రావికమతం: మండలంలో 9, 10 వ తరగతి చదువుతున్న 34 మంది దివ్యాంగ విద్యార్థులకు 2022-23 విద్యా సంవత్సరానికి గాను (నేషనల్ స్కాలర్షిప్) జాతీయ ఉపకార వేతనాలు మంజూరు అయ్యాయని మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్, ప్రత్యేక ఉపాధ్యాయులు బి.మహాలక్ష్మి నాయుడు , ప్రత్యేక ఉపాధ్యాయులు జగన్నాథ నాయుడు తెలిపారు. 2022-23 సంవత్సరానికి గాను జాతీయ ఉపకార వేతనాలతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర శిక్ష ద్వారా ఒకటి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న 16 మంది దివ్యాంగ విద్యార్థులకు ఒక్కొక్కరికి మూడు వేల చొప్పున ట్రాన్స్పోర్ట్ అలవెన్స్ రూ.48 వేలు, 36 మంది దివ్యాంగ విద్యార్థులకు ఒక్కొక్కరికి మూడు వేల చొప్పున ఎస్కార్ట్ అలవెన్స్ 1లక్ష 8,000, 9 మందికి ఒక్కొక్కరికి 3000ల చొప్పున హోమ్ బేస్డ్ అలవెన్స్ రూ.27 వేలు, 46 మందికి ఒక్కొక్కరికి రూ.2000ల చొప్పున గర్ల్స్ స్టైఫండ్ రూ.92,000 లను వారి తల్లి అకౌంట్ లో అమౌంట్ ను జమ చేయడం జరిగిందన్నారు.దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా విద్యను అందించడంతో పాటు ఉపకరణాలను అందించడం జరుగుతుందన్నారు.

విద్యార్థులకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-మాడుగుల:ఆర్థికంగా వెనుక బడి చదువులో రాణించాలని కోరుకునే విద్యార్థులకు సృజనవని స్వచ్ఛంద సంస్థ అండగా నిలబడుతుందని ఆ సంస్థ ప్రతినిధులు గ్నాని, రామారావు తెలిపారు. గత 8 సంవత్సరాలుగా పదవ తరగతి పరీక్ష రాసిన విద్యార్థులకు పాలిటెక్నిక్ ప్రవేశానికి గాను ఉచితంగా కోచింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని విద్యార్థులకు ఈ అవకాశం కల్పించడం జరిగిందని, ఇదే మాదిరిగా ఈ ఏడాది సైతం ఈనెల 17వ తేదీ నుండి మే 8వ తేదీ వరకు మాడుగుల ప్రాంతంలోని 12 పాఠశాలలకు చెందిన విద్యార్థులకు సంస్థ కార్యాలయంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణకు 60 మంది విద్యార్థులను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు.ఆన్లైన్ యాప్ ద్వారా ఉచితంగా పాలిటెక్నిక్ శిక్షణ అందించడం జరుగుతుందని మాడుగుల వీనస్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు తాళ్లపురెడ్డి నాగచంద్ర తెలిపారు.

సోలార్ లైట్లు పంపిణీ



సోలార్ లైట్లు పంపిణీ చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి -పెదబయలు రూరల్:పోలీసులతో ప్రజలు మైత్రి సంబంధం కలిగి ఉండాలని సిఆర్పిఎఫ్ 198 బెటాలియన్ ఇన్స్పెక్టర్ అజయ్ కుమార్ మిశ్రా అన్నారు. శనివారం సిఆర్పిఎఫ్ 198 బెటాలియన్ ఆధ్వర్యంలో సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా రూఢకోట పోలీస్ అవుట్ పోస్ట్ పరిధిలో సిఆర్పిఎఫ్ 198 బెటాలియన్ ఇన్స్పెక్టర్ అజయ్ కుమార్ మిశ్రా, పెదబయలు ఎస్సై పి.మనోజ్ కుమార్ చేతుల మీదుగా 160 మంది గిరిజనులకు సోలార్ లైట్లు పంపిణీ చేశారు. సిఆర్పిఎఫ్ ఇన్స్పెక్టర్ అజయ్ కుమార్ మిశ్రా మాట్లాడుతూ.. రూఢకోట పోలీస్ అవుట్ పోస్టు పరిధిలో గిరిజనులకు అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. గిరిజన యువత ఉద్యోగ ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పెదబయలు ఎస్సై మనోజ్ కుమార్ మాట్లాడుతూ.. యువత అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పండ సుబ్రహ్మణ్యం, ఏఎస్ఐ పోతురాజు, హెడ్ కానిస్టేబుల్ రమేష్ పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి -పెదబయలు:మండల కేంద్రంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. విగ్రహ దాత అంబిడి జగన్నాథం, రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి గుల్లేలి బాబురావులను సన్మానించారు. గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శిహెచ్ బాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ వ్యాసరచన పోటీల్లో విజేతలకు ప్రశంసాప త్రాలు బహుమతులను ఎంపిడిఓ పూర్ణయ్య, మండల విద్యాశాఖ అధికారి కోరవంగి సింహాచలం అందజేశారు ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ.నాయకుడు బి సన్నిబాబు, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మ పృధ్వీరాజ్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొమ్మ కొండబాబు, టిఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు జగత్ రాయ్, వైసిపి సీనియర్ నాయకుడు సూరయ్య, జెడ్పీటీసీ బొంజుబాబు, ఎంపీటీసీ బొంజుబాబు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న నాయకులు

అభివృద్ధి పనులకు అధిక నిధులు : ఎంపీ సత్యవతి

ప్రజాశక్తి-నక్కపల్లి:పాయకరావుపేట నియోజకవర్గానికి అత్యధికంగా ఎంపీ నిధులు మంజూరు చేసినట్లు ఎంపీ వెంకట సత్యవతి తెలిపారు. మండలంలోని ఉపమాక గ్రామంలో సీసీ డ్రైన్ల నిర్మాణానికి సంబంధించి శనివారం ఎమ్మెల్యే గొల్ల బాబురావు, నియోజకవర్గ పరిశీలకులు చింతలపూడి వెంకటరామయ్యలతో కలిసి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డ్రైన్ల నిర్మాణానికి ఎంపీ నిధుల నుండి రూ.9.50 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. పాయకరావుపేట నియోజకవర్గం లో అభివృద్ధి పనులకు సంబంధించి ఎమ్మెల్యే బాబురావు తన దృష్టికి తీసుకు రావడంతో ఎంపీ నిధుల నుండి కోటి రూపాయల వరకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్ ద్వారా గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపడుతున్నామన్నారు.

ఎమ్మెల్యే గొల్ల బాబురావు మాట్లాడుతూ, ఉపమాక అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తానన్నారు. ఇప్పటికే ఉపమాక పంచాయతీ శివారు గ్రామాలకు రోడ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇంటింటికి కుళాయి పథకం తీసుకు వచ్చినట్లు తెలిపారు. ముందుగా మాజీ ఎంపీటీసీ సభ్యులు కొప్పిశెట్టి హరిబాబు గ్రామంలో నెలకొన్న సమస్యలను ఎంపీ ,ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. నక్కపల్లి నుండి ఉపమాక వరకు ఎల్ఈడి బల్బులు ఏర్పాటు చేయాలని, ఇండ్ల స్థలాల మంజూరు, రోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీ భవనాల మంజూరు చేయాలని కోరారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు గాను కొప్పిశెట్టి హరి, ఎంపీటీసీ సభ్యులు కొల్లాటి పార్వతి, బుజ్జిలను ఎంపీ, ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ రత్నం, జడ్పిటిసి కాసులమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు కొల్లాటి పార్వతి, బుజ్జి, మాజీ ఎంపీటీసీ సభ్యులు కొప్పిశెట్టి హరిబాబు, నాయకులు పాపారావు, నరసింహ మూర్తి, మణి రాజు, తాతారావు, సత్తిబాబు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై ర్యాలీ

ప్రజాశక్తి-గొలుగొండ:రోడ్డు భద్రతా వారోత్సవాలపై శనివారం గొలుగొండ మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యాలయం వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై నారాయణరావు మాట్లాడుతూ, ద్విచక్ర వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఇద్దరికి మించి ప్రయాణం ప్రమాదకరమన్నారు. మద్యం సేవించి వాహనం నడుపరాదన్నారు. హెల్మెట్ ధరించి ప్రాణాన్ని కాపాడుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గంజాయితో అరెస్టు

ప్రజాశక్తి-యంత్రాంగం

పద్మనాభం : మండలంలోని మద్ది గ్రామానికి సమీపంలో ఉన్న జంక్షన్‌లో శనివారం 6 కిలోల గంజాయితో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు పద్మనాభం సిఐ సన్యాసినాయుడు శనివారం తెలిపారు. విజయనగరం జిల్లా ఎస్.కోట మండలానికి చెందిన జైగణేష్ (28), పద్మనాభం మండలం మద్ది గ్రామానికి చెందిన కాళ్ల ఉమా శంకర్ (22) గంజాయితో పట్టుబడినట్లు ఆయన చెప్పారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

నక్కపల్లి :మండలంలోని కాగిత టోల్ గేట్ వద్ద శుక్రవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమంగా తరలిస్తున్న గంజాయిని స్వాధీన పరుచుకుని, స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ శిరీష శనివారం తెలిపారు. ఒడిశాలోని ఐషర్ వ్యాన్ లో గంజాయిని లోడ్ చేసుకుని బంగాళా దుంపల లోడ్ కింద దాచి రాజమండ్రి వెళుతుండగా తనిఖీ చేసి స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు. 88 కేజీల గంజాయిని స్వాధీన పరుచుకుని మధ్యప్రదేశ్ హీరాపూర్ గ్రామానికి చెందిన రాజా భయ్యా వర్మ, గంజాయి రవాణాకు సంబంధం ఉన్న తణుకు గ్రామానికి చెందిన ఈమంది శివ ధనుష్‌లను సీఐ నారాయణరావు అరెస్టు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పట్టుబడ్డ గంజాయి విలువ సుమారుగా లక్ష 76 వేలు ఉంటుందని ఎస్ఐ శిరీష వెల్లడించారు

గృహ నిర్మాణాల పరిశీలన

ప్రజాశక్తి-నక్కపల్లి:వేగవంతంగా గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారిణి కె రమామణి సూచించారు. మండలంలోని ఉపమాక గ్రామంలో శనివారం జగనన్న లే అవుట్ ను ఎంపీడీవో సీతారామరాజు, ఈఓపిఆర్‌డి వెంకటనారాయణ, హౌసింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. త్వరతగతిన గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. పేమెంట్లు మంజూరులో ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. జగనన్న కాలనీలో విద్యుత్, నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. అన్ని మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. ముందుగా మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ అధికారులు, వర్క్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు .

మాడుగుల:జగనన్న లే ఔట్లలో నిర్మాణం అవుతున్న గృహాలను శనివారం అధికారులు పరిశీలించారు. మండలంలోని జంపిన, ఎం.కృష్ణాపురం గ్రామాలలో గృహాలను ఎంపీడీవో మీనా కుమారి, హౌసింగ్ ఏఈ లెక్కల సత్యనారాయణ తదితరులు పరిశీలించారు. జంపెన లో 13 గృహాలు, ఎం కష్ణాపురంలో 32 గృహాలు నిర్మాణం అవుతున్నాయని వీటిని త్వరితగిన పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. ఇంకా మొదలుకాని అనేక ఇళ్ళను త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు

వాలంటీర్ల భారీ ర్యాలీ

ప్రజాశక్తి -రావికమతం: విధి నిర్వహణలో ఉన్న గ్రామ వాలంటీర్స్ పై దాడులకు పాల్పడ్డ వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలంటూ మండల కేంద్రంలో వాలంటీర్స్ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రావికమతం మండల వాలంటీర్స్ యూనియన్ నాయకుడు ప్రగడ నాయుడు బాబు మాట్లాడుతూ, ప్రభుత్వం వాలంటీరు వ్యవస్థను ప్రవేశపెట్టి సంక్షేమ పథకాలను ప్రజల వద్దకే అందిస్తుందన్నారు.గ్రామాలలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వాలంటీర్స్ వ్యవస్థ ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కొంతమంది నాయకులు అసూయతో తమపై దాడులకు పాల్పడుతున్నారని ఆయన అన్నారు. ఇటీవల బుచ్చయ్యపేట మండలం నీలకంఠపురం గ్రామంలో పడాల శివ అనే గ్రామ వాలంటీర్ విధి నిర్వహణలో భాగంగా ఇంటి పన్ను కట్టమని గ్రామానికి చెందిన కొందరు వ్యక్తుల వద్దకు వెళ్లి అడిగినప్పుడు వారు అతనిపై దాడి చేయడం సరికాదన్నారు. ఇటువంటి దాడులు పునరావృతమైతే జిల్లా స్థాయిలో భారీ ఉద్యమం చేపట్టడం తధ్యమని ఆయన హెచ్చరించారు. అనంతరం తరం ఎంపీడీవో వెంకన్న బాబు, స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్సై ఉమామహేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు.

499 రోజుకు మహా ధర్నా

ప్రజాశక్తి -నక్కపల్లి:హెటిరో మందుల కంపెనీ కొత్తగా వేస్తున్న పైపులైన్‌కు వ్యతిరేకంగా తమ పోరాటాన్ని కొనసాగిస్తామని మత్స్యకార నాయకులు స్పష్టం చేశారు. పైప్ లైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహా ధర్నా 499వ రోజుకు చేరింది.శనివారం శిబిరం వద్ద మత్స్యకారులు పైప్‌లైన్‌కు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు.


ప్రచారం నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

గ్రామాల్లో 'జగనన్నే మా భవిష్యత్తు'

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని అడాకుల పంచాయితీ పరిధి బి.కొత్తూరు, కన్నంపేట గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం వైస్ ఎంపీపీ అప్పన వెంకటరమణ, సచివాలయ కన్వీనర్ గాడి ఆచ్చిరాజు ఆధ్వర్యాన శనివారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలుసుకొని వైసీపీ ప్రభుత్వం వల్ల చేకూరిన లబ్ధిని వివరించి, గత ప్రభుత్వం మోసగించిన తీరును ఎండగట్టారు. ప్రజా మద్దతు పుస్తకంలో పొందుపరచిన ఐదు ప్రశ్నలను వారి ద్వారా సమాధానం అవును అని చెప్పినట్లయితే వారికి రసీదు అందించి వారి నుంచి మద్దతు స్వీకరిస్తూ వారి అనుమతితో ఇంటి గోడపై జగనన్నే మా భవిష్యత్తు అనే స్టిక్కర్‌ను, సెల్ ఫోన్ పౌచ్‌పై స్టిక్కర్లు అతికించి వారితో కలిసి ఫోటో దిగారు. ఈ కార్యక్రమంలో రేసుకట్ల కొండబాబు, పిఎసిఎస్ చైర్మన్ గజ్జయ్య దొర, స్థానిక నాయకులు కన్నయ్యదొర, నానాజీ, పి.రాజేశ్వరి, మల్లాడి జోగిరాజు వార్డు మెంబర్ లక్ష్మణ్, సచివాలయ గృహసారథులు, వాలంటీర్లు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

మారెమ్మతల్లి ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో మారెమ్మ తల్లి ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. 13 రోజులపాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. ఇందులో భాగంగానే ఈనెల 23న ప్రధాన పండుగ నిర్వహించనున్నారు. 26వ తేదీతో పండగ ముగిస్తుంది. ఇప్పటికే మారెమ్మ అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మారెమ్మ అమ్మవారు ఉత్సవాలకు ఒక ప్రత్యేకత ఉంది ప్రతి ఏటా తమిళ సంవత్సరాది ఏప్రిల్ 14 నుంచి ప్రారంభించడం ఆనవాయితీగా వస్తుంది. సీలేరు ప్రాజెక్టు నిర్మాణం సమయంలో తమిళనాడు నుండి వచ్చిన వారంత ఆలయ ప్రాంగణం సమీపంలో నివసించేవారు. అప్పట్లోనే మారెమ్మ అమ్మవారి వెలసినట్లు భక్తులు చెబుతుంటారు. మొదటిగా తమిళనాడు వాస్తవ్యులు మారెమ్మ అమ్మవారిని కొలిచేవారు. కాలక్రమైనా మారెమ్మ అమ్మవారు సీలేరు భక్తులకు ఇలవేల్పుగా మారింది. 13 రోజులు పాటు సాగే ఈ పండగలో అగ్నిగుండం మీదగా గరగ ఆలయంలోకి ప్రవేశించడం ముఖ్యమైన ఘట్టంగా భక్తులు భావిస్తారు. భక్తులు మారమ్మ అమ్మవారి మాలలు ధరించి తొమ్మిది రోజులు ఉపవాస దీక్షలు చేసి గరగ అలంకరణ రోజున ఏర్పాటు చేసిన అగ్నిగుండం మీద నుంచి భక్తులు నడుచుకుంటూ ఆలయంలో ప్రవేశించి వారి భక్తిని చాటుకుంటారు. ప్రధాన పండుగ రోజు ఆంధ్ర, ఒరిస్సా, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారి మొక్కలు తీర్చుకుంటారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ఆలయ ప్రాంగణంలో అన్ని ఏర్పాట్లు చేసింది.

కొండగెడ్డపై వంతెన నిర్మించరూ...

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని శరభన్నపాలెం, కంపరేకుల గ్రామాల మధ్య ఉన్న కొండ గెడ్డపై వంతెన లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు వాపోతున్నారు. దశాబ్దాలుగా వంతెన నిర్మాణం చేపట్టకపోవడంతో శరభన్నపాలెం పంచాయతీ పరిధిలోని 9 గ్రామాల ప్రజలు రాకపోకలకు అష్ట కష్టాలు పడుతున్నారు. రెండేళ్ల క్రితం మినీ వంతెన నిర్మించినప్పటికీ అది తరువాత కురిసిన వర్షాలకు కొట్టుకుపోయింది. వర్షాకాలం వచ్చిందంటే కొండనుండి వచ్చే నీటితో వరద ఉధృతి అధికంగా ఉంటుంది. ఈ వరద తగ్గేంతవరకు ఈ 9 గ్రామాల ప్రజలకు మండల కేంద్రంతో సంబంధాలు తెగిపోతున్నాయి. ఈ గెడ్డపై వంతెన నిర్మాణానికి గతంలో నాయకులు పలుమార్లు హామీలు ఇచ్చినా అవి నీటి మూటలుగానే మిగిలిపోయాయని గిరిజనులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శరభన్నపాలెం, కంపరేకుల గ్రామం మధ్య ఉన్న కొండ గెడ్డపై వంతెన నిర్మించాలని కోరుతున్నారు.గ

ఉక్కుపై కుట్రలు తీవ్రం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై గందరగోళం సృష్టించి బలహీనపరిచే కుట్రలను కేంద్రంలోని బిజెపి సర్కారు తీవ్రం చేస్తోంది. స్టీల్‌ప్లాంట్ కోసం చేసిన పోరాటం, త్యాగాలను ఏ మాత్రమూ పరిగణలోకి తీసుకోని ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉండడంతో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, కార్మిక సంఘాలు మరింత బలంగా తమ ఉద్యమాన్ని ప్రజల సహకారంతో ముందుకు తీసుకెళ్లాలని తాజాగా కదులుతున్నాయి. తాజాగా కేంద్ర సహాయ మంత్రి ఫగన్ సింగ్ కులస్థే విశాఖలో రోజ్‌గార్ మేళాలో ఈ నెల 13న పాల్గొని మీడియా వద్ద ఆర్ఐఎన్ఎల్ ప్రైవేటీకరణపై తమ ప్రభుత్వం ముందుకెళ్లడం లేదని ప్రకటించారు. కార్మిక సంఘాలు, ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తున్న సమయంలో సాయంత్రానికల్లా వైజాగ్ నోవటల్‌లో మాట మార్చి ప్రైవేటీకరణ విషయంపై తాను ఎలాంటి నిర్ణయమూ చేయలేనంటూ చేతులెత్తేశారు. దీంతో కార్మికవర్గంలో మళ్లీ కలవరం మొదలైంది.

సొంత గనుల్లేకపోయినా దేశంలోనే మేజర్ స్టీల్‌మేకర్ 'విశాఖ ఉక్కు'

దేశంలోనే సొంత గనుల్లేకపోయినా ఉక్కును ఉత్పత్తి చేసే భారీ స్టీల్‌పరిశ్రమగా వైజాగ్ స్టీల్ వెలుగొందుతుండడంతో కేంద్రంలోని కాషాయ పాలకులు కక్షాపూరితంగా వ్యవహరిస్తున్నారు. రూ.లక్షల కోట్ల విలువైన ఆస్తులున్నప్పటికీ కేవలం రూ.1000 కోట్లు వర్కింగ్ కేపిటల్‌ను ఇవ్వలేని దుస్థితిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయంటే స్టీల్‌ప్లాంట్ భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టే ప్రయత్నాలు ఊపందుకుంటున్నాయన్నది స్పష్టమవుతోంది. 2021 జనవరిలో వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను 100 శాతం ప్రైవేటీకరించడం, లేదా అమ్మేయాలని మోడీ సర్కారు నిర్ణయించిన నుంచీ విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికవర్గం, ప్రజానీకం పెద్ద ఎత్తున పోరాడుతున్న విషయం తెలిసిందే. అటు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, అక్కడి ప్రజానీకం, మేధావులు సైతం విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ జరగాలని, మోడీ ప్రైవేటీకరణ విధానం నాశనం కావాలని కోరుకుంటున్న సంగతి ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. 1962లో విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అన్న నినాదంతో పోరాడి యావత్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రజలు దీన్ని సమైక్యంగా సాధించారు. ఈ పోరాటంలో 32 మంది ప్రాణాలు కోల్పోయారు. కేవలం కేంద్ర ప్రభుత్వం అప్పట్లో రూ.4890 కోట్లు మాత్రమే పెట్టుబడిగా ఇవ్వగా మరో రూ.4 వేల కోట్లును బ్యాంకు రుణం ద్వారా స్టీల్‌ప్లాంట్ సమకూర్చుకుని తిరిగి రూ.16,300 కోట్లను పెట్టుబడిగా పెట్టి కెపాసిటీని పెంచుకునేందుకు ఆర్ఐఎన్ఎల్ సొంతంగా కృషిచేయడం విశేషం. ఈ నిధుల ద్వారా 3.2 మిలియన్ టన్నుల నుంచి 7.3 మిలియన్ టన్నులకు రెండు దఫాలుగా విస్తరణ చేసుకుంది. ఇంకా సొంత గనులు కల్పించి ఉండి ఉంటే, వర్కింగ్ కేపిటల్, రా మెటీరియల్‌ను కేంద్ర ప్రభుత్వం అందించి ఉండి ఉంటే 12 మిలియన్ టన్నులకు వెళ్లేందుకు స్టీల్‌ప్లాంట్ ఉద్యోగ, కార్మిక సంఘాలు, యాజమాన్యం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

భవిష్యత్తును దెబ్బతీసే చర్యలు

ఉత్తరాంధ్ర ప్రజానీకానికి ఉపాధి కల్పించే కల్పతరువుగా ఉండే స్టీల్‌ప్లాంట్‌పై కాషాయమూకలు దొంగదెబ్బ కొట్టాలని చూడడం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి సర్కారు కనీసం తెలంగాణ సర్కారు ఇచ్చిన నైతిక మద్దతును కూడా ఇవ్వకపోవడం కార్మికవర్గాన్ని, ఈ ప్రాంత ప్రజలను ఒకింత అనిశ్చితికి గురిచేస్తోంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుని వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై స్పష్టమైన ప్రకటన చేసి కేంద్రంపై ఒత్తిడి పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు నాటక రంగ వేడుకలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రంగసాయి నాటక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 16న తెలుగు నాటక రంగ దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్టు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు బాదంగీర్ సాయి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగరంలోని టిఎస్ఆర్ కాంప్లెక్సు వద్ద ఉన్న రంగసాయి నాటక గ్రంథాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఆధునిక తెలుగు నాటక రంగంలో తొలి నాటకకర్త, తొలి దర్శకుడు, తొలి ప్రదర్శనకారుడైన కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి నేపథ్యాన్ని పురస్కరించుకుని తెలుగు నాటకరంగ దినోత్సవంగా పరిగణిస్తున్నట్టు గుర్తు చేశారు. ఈ సందర్భంగా రంగస్థల పురస్కారాలను అందజేయనున్నట్టు తెలిపారు. నగరంలో నాటక రంగానికి చెందిన ఎం.శివజ్యోతి, వర్రె నాంచారయ్య, సివిఆర్ మూర్తి, ఇప్పిలి ఆదినారాయణలకు అవార్డులందజేస్తున్నట్టు వెల్లడించారు. ఎంవి.సుబ్రహ్మణ్యం బృందంచే లఘు నాటిక ఉంటుందన్నారు.

విశాఖపై వాతావరణ ప్రభావం అధికం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంపై వాతావరణ ప్రభావం అధికంగా ఉంటుందని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. శనివారం ఆమె హోటల్ ది పార్కులో వాతావరణం మార్పుపై జరిగిన వర్క్ షాప్‌లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ తీర ప్రాంతంతో పాటు పారిశ్రామిక నగరం అవడం వల్ల నిరంతరం వాతావరణంలో మార్పులు ఉంటాయని తెలిపారు. ఈ నగరానికి తుపాను ప్రభావం కూడా అధికమేనన్నారు. గతంలో హుదూద్, గులాబ్ లాంటి తుపానుల ప్రభావాన్ని ఎదుర్కొన్నామని గుర్తు చేశారు.

పర్యావరణ పరిరక్షణకుగాను ఇంకుడు గుంతల ఏర్పాటు, చెట్లు పెంపకం వంటి చర్యలు చేపట్టాలని కోరారు. సోలార్ ఎనర్జీ, ఎల్ఇడి స్ట్రీట్ లైట్, విద్యుత్ వాహనాలు, నీటి ప్రాజెక్టుల వినియోగం ద్వారా గాలిలో కార్బన్ డయాక్సైడ్‌ను తగ్గించుకోగలమని తెలిపారు. కార్యక్రమంలో జివిఎంసి బయాలజిస్ట్ కె.చక్రవర్తి, స్మార్ట్ సిటీ కార్యనిర్వహణ ఇంజినీర్ వి.సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన మేడే ఉత్సవాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా ఈ నెల 30న డాబా గార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో మే డే సాంస్కృతిక ఉత్సవాలను విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు ఎఎస్‌వికె బాధ్యులు జిఎస్.రాజేశ్వరరావు, సాంస్కృతిక విభాగం బాధ్యులు దండు నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులలో కళా ప్రావీణ్యంగల వారందరినీ ఒక దగ్గరకు చేర్చి ఆ రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉత్సవాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పాటలు, పద్యాలు, శ్రామిక అభ్యుదయ గీతాలు, శాస్త్రీయ నృత్యాలు, కోలాటాలు, తప్పెటగుళ్లు, ఏకపాత్రాభినయాలు, ఫ్లూటు తదితర వాయిద్య కళారూపాలు, మిమిక్రీ, హాస్యం, షార్ట్ ఫిలిమ్స్ తదితర కళారూపాల్లో ప్రావీణ్యం ఉన్న వారంతా ఈ ఉత్సవాల్లో పాల్గొనవచ్చని తెలిపారు.

ప్రదర్శించే ఏ కళారూపమైనా విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ సంస్థల పరిరక్షణ, దేశభక్తి, దేశ సమైక్యత, సమగ్రత, లౌకికతత్వం, సామాజిక న్యాయంలపై ఉండాలన్నారు. ఆసక్తిగలవారు ఈ నెల 25లోగా తమ ఎంట్రీలను 9490750661,. 9490098794 వాట్సాప్ నెంబర్లకు పంపించాలని కోరారు.



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ రమాదేవి

వంతెన నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - కొయ్యూరు : ఎన్నో ఏళ్లుగా పెండింగ్లో ఉన్న మండలంలోని చింతలపూడి - గింజర్తి గ్రామాలమధ్య వంతెన నిర్మాణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. చింతలపూడి సర్పంచ్ సెగ్గె రమాదేవి, ఎంపిటిసి సభ్యురాలు పొడుగు రత్నం శనివారం పనులను ప్రారంభించారు. ఇక్కడ ఉన్న కల్వర్టు పూర్తిగా శిథిలమవడంతో వాహనాల రాకపోకలకు పూర్తిగా అంతరాయం ఏర్పడి సుమారు 30 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ వంతెన నిర్మాణానికి ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని గతంలో స్థానికులు ఆవేదన చెందిన సందర్భాలున్నాయి. ఎట్టకేలకు వంతెన నిర్మాణ పనులు ప్రారంభించడంతో అంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మేడా కృష్ణ, వైసిపి నాయకులు దూపం శ్రీను, ఉల్లి సూరిబాబు, దేశిన మహేష్ పాల్గొన్నారు.

జివిఎంసి కమిషనర్‌గా

సాయికాంత్ వర్మ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ నూతన కమిషనర్‌గా సిఎం.సాయికాంత్ వర్మ శనివారం మధ్యాహ్నం 12 గంటలకు జివిఎంసి ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. 2015 బ్యాచ్‌కి చెందిన ఈ ఐఎఎస్ అధికారి వైఎస్ఆర్ కడప జిల్లాలో జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకూ జివిఎంసి కమిషనర్‌గా పనిచేసిన పి.రాజాబాబు ఉద్యోగోన్నతిపై కృష్ణా జిల్లా కలెక్టర్‌గా వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం సాయికాంత్ వర్మ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని అతిపెద్ద కార్పొరేషన్‌గా ఉన్న జివిఎంసికి కమిషనర్‌గా రావడం ఎంతో గర్వంగా ఉందన్నారు. తనకు ఈ అవకాశం ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో పనిచేసిన కమిషనర్లు చేపట్టిన మంచి కార్యక్రమాలను తానూ కొనసాగిస్తానన్నారు. అధికారులు, మీడియా ప్రతినిధులు సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. అనంతరం ఆయన మేయర్ హరి వెంకట కుమారిని, విశాఖ జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జునను మర్యాదపూర్వకంగా కలిశారు.

కెజిహెచ్ ఎస్‌టి సెల్ ప్రక్షాళనపై హర్షం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కెజిహెచ్ ఎస్‌టి సెల్‌ను ప్రక్షాళన చేయడంలో భాగంగా మొత్తం సిబ్బందిని బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 15న ముంచింగిపుట్టుకి చెందిన శిశువు మృతదేహాన్ని కెజిహెచ్ నుంచి తండ్రి బైకుపై వారి స్వగ్రామానికి చేరవేసిన తీరును తమ కమిషన్ సుమోటోగా తీసుకుందని తెలిపారు. ఘటనకు బాధ్యులైన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు బదిలీ చేయాల్సిందేనని సంబంధిత శాఖలకు అప్పట్లోనే నోటీసులు జారీ చేసిందని అన్నారు. కమిషన్ ఆదేశాలను పరిశీలనలోకి తీసుకున్న పాడేరు ఐటిడిఎ, అల్లూరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు, ఉన్నతాధికారులు మొత్తం సిబ్బందిని బదిలీ చేసి కొత్తగా 11 మందిని ఎస్‌టి సెల్‌లో నియమించడం బాలల హక్కుల విజయంగా భావిస్తున్నామని తెలిపారు.

పలు ప్రాంతాల్లో ఎమ్మెల్సీ వంశీకృష్ణ పర్యటన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి 21వ వార్డులోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్ జివిఎంసి అడిషినల్ కమిషనర్ సన్యాసిరావుతో కలిసి శనివారం పర్యటించారు. అవుట్ గేట్ డౌన్, కిర్లంపూడి లే అవుట్, బీచ్ రోడ్ పరిసర ప్రాంతాలలోగల ప్రజలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు